
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024 5



నాయకుల చల్లనిచూపు.. అధికారుల అండ ఉంటే ఇంకేముంది.. అక్రమార్కులు రెచ్చిపోతారు.. సుప్రీంకోర్టు చెబితే వింటారా.. ఎన్‌జీటీ చెబితే వింటారా.. ఎవరు చెప్పినా అంతే..! అధికార దండమే మెడలో వేసుకుని తిరిగేవాళ్లకు అడ్డేమి ఉంటుంది.. ప్రస్తుతం జిల్లాలో ఇదే జరుగుతోంది.. ఒక పక్కన సుప్రీంకోర్టు.. యంత్రాలతో ఇసుక తీత ఆపి.. అక్రమాలు నిలిపివేసి.. ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని ఆదేశించినా ఎక్కడా ఇసుక తవ్వకాలు ఆగలేదు.. యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి.. అంతే కాకుండా జిల్లాలో కమిటీలు వేయాలని కూడా ఆదేశించింది. మన జిల్లాలో ఇసుక కమిటీ ఉంది.. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు.. అవేమీ అక్రమాలను ఆపలేకపోయాయి.. యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం లోనూ ఇదే పరిస్థితి. అధికార వైసీపీ ఒత్తిళ్లకు లొంగి అధికారులు ఇప్పటికీ ఇసుక అక్రమాలను కళ్లప్పగించి చూస్తున్నారు. పైగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇచ్చిన నివేదికలు పక్కదారి పట్టించాయనే విమర్శలు ఉన్నాయి. మరి ఈసారి నివేదిక ఎలా ఇస్తారోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

గోదాట్లో అంతా.. దొంగలే!



ఇది కాదా డ్రెడ్జింగ్ : కొవ్వూరు వైపు రోడ్‌కం రైలు బ్రిడ్జి వద్ద సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్

కళ్లుండీ..చూడలేరు : రాజమహేంద్రవరం గాయత్రి ర్యాంపులో శనివారం యథేచ్ఛగా సాగుతున్న ఇసుక తవ్వకాలు

దోపిడీకి బాటలు : పెరవలి మండలం తీపర్రు ఇసుక దోపిడీకి గోదావరిలో వేసిన బాటలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు కొదువే లేదు. అఖండ గోదావరిలో సాగుతున్న డ్రెడ్జింగ్‌ను గోదావరి జిల్లా ప్రజలతో పాటు రోడ్ కం రైలు, ఫోర్త్ బ్రిడ్జి, రైల్వే ఆర్చ్ వంతెన మీద రైళ్లలోనూ, ఇతర వాహనాల్లో ప్రతి రోజూ ప్రయాణించే వేలాది మంది చూస్తూనే ఉన్నారు. అయితే మన అధికార యంత్రాంగానికి ఇవేమీ కనిపించడంలేదు. అధికార వైసీపీలోని పెద్దల ఒత్తిడికి భయపడి, కుమ్మక్కయ్యారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.ఈ ఐదేళ్లలోనూ వైసీపీ పెద్దలు చెప్పినట్టు విని తప్పులు జరుగుతున్నా కళ్లు మూసుకున్న అధికారులు ప్రస్తుతం భయపడిపోతున్నారు. కొత్త ప్రభుత్వం వస్తే ఆ కుంభకోణాలపై విచారణ ఉంటుందని చర్చించుకుంటూ వణికిపోతున్నారు. ఎన్నికలు ముగిసినా ఇంకా వైసీపీ నేతల ఒత్తిడి తగ్గలేదు. ఇసుక అక్రమాలు ఆగలేదు.

ఆర్‌కే... ఇతనో దోపిడీదారు?

కొవ్వూరులో ప్రేమ్‌రాజ్ ఆత్మహత్య తర్వాత మొత్తం అఖండగోదావరి పడవ ర్యాంపులన్నీ ఆర్‌కే అనే వ్యక్తి చేతిలోకి వెళ్లాయి. అతను పైసా కూడా పెట్టుబడి లేకుండా స్థానికంగా ఇసుక తీసే వ్యక్తులకు, వైసీపీ నేతలకు ర్యాంపులు అప్ప గించి రూ.కోట్లు గడించాడు. ఏపీఎండీసీ హయాంలో ఇసుక వ్యాపారం జరి గినపుడు రూ.5 కోట్ల డిపాజిట్ సొమ్ము నొక్కేసి ఇటీవల జైలుకు కూడా వెళ్లడం గమనార్హం. అతని ఆధ్వర్యంలో వైసీపీ పెద్దలు ఇక్కడ వందల కోట్ల ఇసుక కుంభకోణానికి పాల్పడ్డారు. ఇప్పటికీ ఇసుకను తోడేస్తూనే ఉన్నారు. అనుమతి లేకుండా ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ రాత్రి పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిపోతున్న సంగతి తెలిసిందే. మరో పక్క గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన సంస్థ పేరుతో డిసెంబర్ నుంచి మరింత డ్రెడ్జింగ్ జరుగుతోంది. ఇదో పెద్ద కుంభకోణమంటూ విమర్శలు వస్తు న్నాయి. గత మే నెల నుంచి అనుమతుల్లేకుండా జిల్లా శాండ్ కమిటీ నుంచి ఆమోదం పొందినట్టు చెబుతూ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచిన సం గతి తెలిసిందే. కొద్ది రోజు లుగా ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగారు.దోపిడీ ఇలా ఉంటే అధికారి కంగా డ్రెడ్జింగ్ అంటూ మరొకరు రంగంలోకి దిగారు. సుమారు రెండేళ్ల కిందట బ్యారేజీకి ఎగువ నుంచి గామన్ బ్రిడ్జి వరకూ అఖండ గోదా వరిలో నీటి నిల్వ పెంచడానికి వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. అప్పట్లో ముగ్గురు కాంట్రా క్టర్లు టెండర్లు వేయగా వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కే ఒకే చేయిం చారు.ఆ కాంట్రాక్టర్ చాలా కాలం వదిలేశారు. ఇటీవల రంగంలోకి దిగారు. ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం 1.70 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. రాజమ హేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ. 144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్ల కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి ఎవరూ కనిపించరు. కనీస నిబంధనలు పాటించడంలేదు. ఇదే సమ యంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట ఉండే వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ కొనసాగు తూనే ఉంది.గాయత్రి, కోటి లింగాల,కాతేరు, వెంకటనగర్, కొవ్వూరు ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ జరుగుతోంది.

వేల కోట్లు దోచేశారు..

గోదాట్లో రూ.వేల కోట్ల ఇసుక కుంభకోణం జరిగింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అమల్లో ఉండేది. రవాణా, లోడింగ్ చార్జీలు పెట్టుకుంటే ఇసుక దొరికేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రకరకాల ప్రయోగాలు చేశారు.ఏపీఎండీసీ చేత కొద్దిరోజులు చేయించి రూ.వందల కోట్లు దోచుకు న్నారు. తర్వాత జేపీ సంస్థకు రెండేళ్లు కాంట్రాక్టుకు ఇచ్చి ఎటువంటి అను మతులు, బిల్లులు కూడా లేకుండా ఇసుక తవ్వేసిన సంగతి తెలిసిందే.దీనిపై లెక్కలు అడిగినా ఏ అధికారీ చెప్పలేకపోతున్నాడు. తమ వద్ద లేవని చెప్పడం గమనార్హం. గత మే నెలలో జేపీ సంస్థ కాంట్రాక్టు పూర్తయిపోవడంతో నేరుగా వైసీపీ పెద్దలే ప్రతి నెలా రూ.కోట్లు కప్పం కట్టేవిధంగా అనధికారికంగా ఇసుక వ్యాపారాన్ని తమ అనుచరులకు అప్పగించిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో కొవ్వూరు వైపు ఒక అనధికార కాంట్రాక్టర్ ప్రేమ్‌రాజ్ రైలుపట్టాల కింద తలపెట్టి బలన్మరణం చెందిన సంగతి తెలిసిందే.

బ్రిడ్జిల ప్రక్కనా తవ్వేస్తున్నారు..

వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజీకి మూడు కిలోమీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలు జరగకూడదు. రోడ్డు కమ్ రైలు బ్రిడ్జి ఎగువ వైపు 500 మీటర్లు దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయకూడదు.ఇది నిబంధన. గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే.ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.

ఐదేళ్లుగా మహా ఇసుక కుంభకోణం

గామన్ బ్రిడ్జి అవతల డ్రెడ్జింగ్

ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే సమీపంలోనే తవ్వేస్తున్నారు.అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇటీవల గామన్ బ్రిడ్జి కొంతమేర కుంగి పోయిన సంగతి తెలిసిందే. అయినా ఇసుక అక్రమాలు ఆగడంలేదు. ఇన్ని అక్రమాలు జరుగు తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు..ఇవాళ సుప్రీంకోర్టుకు ఏమని రిపోర్టు చేస్తారో చూడవలసిందే.

- సుప్రీంకోర్టు ఆదేశించినా ఆగని తవ్వకాలు
- ఇసుకాసురులకు అధికారుల అండదండలు
- గతంలో ఇచ్చిన నివేదికలన్నీ తప్పుడివే
- వణికిపోతున్న అధికార యంత్రాంగం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- నేటికీ యథేచ్ఛగా సాగుతున్న డ్రెడ్జింగ్
- ఇప్పుడేం నివేదికిస్తారో చూడాల్సిందే



కొవ్వూరులో శనివారం లోడింగ్ ఇలా..



కనిపించదా సారూ : రోడ్ కం రైలు బ్రిడ్జి చెంతనే సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్

అనధికారికంగా డ్రెడ్జింగ్

కొవ్వూరు, మే 18 : గోదావరిని అధికార పార్టీ నేతలు అనధికారిక డ్రెడ్జిం గ్‌తో ఇసుకను దోచుకుంటున్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో గోదావరి వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి గత ఐదేళ్లుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. గోదావరి నదిలో బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు పడవల ద్వారా నదిలోకి వెళ్లి ఇసుక తవ్వకాలు చేపట్టాలి. కానీ దానికి విరుద్ధంగా భారీ యంత్రాలతో అనధికారికంగా డ్రెడ్జింగ్ చేసి గోదావరి నదిని కొల్లగొట్టి ఇసుక దోచుకుంటున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్నిస్తున్నా అధికార పార్టీ నేతలు, అధికారుల్లో కనీసం కదలిక లేదు. అక్రమ తవ్వకాలను అడ్డుకుని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌లో నిర్బంధించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కొవ్వూరు, రాజమహేంద్రవరంలను కలుపుతూ గోదావరిపై నిర్మించిన నాలుగు లైన్ల వంతెన (గామన్ బ్రిడ్జి) కొవ్వూరు వైపు కుంగిపోయింది. మరమ్మతు పనులను పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకు పాత్రికేయులు గామన్ వంతెన సమీపంలో డ్రెడ్జింగ్ చేస్తున్న యంత్రాన్ని చూపించిన ఎటువంటి ఫలితం లేదు. ఆ సమయంలో కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గోదావరిలో డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతి లేదని, కేవలం బోట్స్‌మెన్ సొసైటీ లు మాత్రమే తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. అనధికార డ్రెడ్జింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈబీ, పోలీస్ అధికారులకు ఆదేశాలిస్తామని తెలిపారు. సుమారు రెండు నెలలైనప్పటికి డ్రెడ్జింగ్ యథేచ్ఛగా జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, ఎస్‌ఈబీ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దులు చెరిపేసి.. అడ్డగోలుగా తవ్వేశారు..

కడియం, మే 18 : ఇసుకాసురులు రెచ్చిపోయారు.. వేమగిరి-బుర్రిలంక ర్యాంపులో ఇష్టానుసారం ఇసుక తవ్వేశారు. భారీ యంత్రాలతో సుమారు 30 అడు గుల లోతు వరకు ఇసుకను తవ్వి నదీగర్భానికి తూట్లు పొడిచారు. ఇప్పటికీ ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉంది. కడియం మండలం వేమగిరి-బుర్రిలంక లంకలతో పాటు ఆవల ఒడ్డున ఉన్న ఆత్రేయపురం మండలం వద్దిపర్రు వరకు హద్దులు చెరిపేసి మరీ ఇసుకను దోచేస్తున్నారు. ఇటీవల ఉన్నత న్యాయస్థానం తవ్వకాలు చేయవద్దని ఆదేశాలివ్వడంతో ముందే నిల్వ ఉంచిన అక్రమ స్టాకు తరలించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. గతంలో జియోట్యాగింగ్ చేసి ఏడాదికి ఇంత మేరకు తవ్వకాలు చేయాలని ఆంక్షలు ఉండేవి. ప్రస్తుతం అవేం లేవు.. ఉన్నది ఒకటే తవ్వుకో.. దోచుకో అంతే. దీంతో ఇసుకను యంత్రాల సాయంతో రాత్రి పగలూ తేడా లేకుండా తవ్వేస్తున్నారు. ఇటీవల అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో ఇష్టానుసారం తవ్వేసి తరలించేశారు. కాటన్ బ్యారేజీకి కేవలం కొద్ది మీటర్ల దూరంలో ఉన్న వేమగిరి-బుర్రిలంక ఇసుక ర్యాంపులో కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా తవ్వకాలకు పాల్పడ్డారు. అనధికారిక స్టాక్‌పాయింట్లు పెట్టి గుట్టలుగా ఇసుకను నిల్వ పెట్టారు.



పట్టుకోండి చూద్దాం : బుర్రిలంకలో ఏటిగట్టు చెంతనే ఉన్న ఇసుక గుట్టలు

కనిపెట్టండి చూద్దాం : తీపర్రులో నీటికి అడ్డుకట్ట వేసి సాగిన ఇసుక తవ్వకాలు

గోదావరిలో నీరు ఆపితే.. బాగోతం బయటకు..

పెరవలి, మే18: తీపర్రు గోదావరి ఇసుక ర్యాంప్‌లో అక్రమ తవ్వకాలపై అధికారులేం తేలుస్తారోనని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 2025 వరకు ప్రతిమ కంపెనీకి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు అధికారులు వస్తే ర్యాంప్‌లో తవ్వకాలు ఆపి ఖాళీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వచ్చిన రోజు ఆ తవ్విన ప్రదేశం అంతా కలియ తిరిగారు.. అదే సమయంలో అక్రమంగా తవ్విన ఇసుక ఎంతో లెక్క కట్టాల్సి ఉన్నప్పటికి ఆ విధంగా చేయలేదు. అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే బ్యారేజీ వద్ద దిగువకు వదిలే నీటిని 4 రోజులు ఆపి వేస్తే ఇక్కడ నీటి నిల్వలు తగ్గి అక్రమాల బాగోతం బయటపడుతోంది. గోదావరిలో ఇసుక ఎంత తరలిపోయింది.. అక్కడి ఇసుక గుట్టలు చూస్తే అర్థమవుతుందని ఆ గుట్టలను కూడా పట్టించుకోకుండా వదిలివేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అటు కోర్టులను , ఇటు ప్రజలను మోసగించే ప్రయత్నాలు మానుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్‌కు.. ఓటు..నోటు!



కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు

ప్రస్తుతం జనానికి ఎన్నికల పండుగొచ్చింది.. ఎన్నికల పండుగేమిటంటారా.. డబ్బులు ఎప్పుడు చేతిలో ఉంటే అప్పుడే పండుగ కదా.. ప్రస్తుతం ఏ ఇద్దరు మహిళలు ఫోన్‌లో మాట్లాడుకున్నా ఇదే గొడవ.. ఓటుకు మీకెంత ఇచ్చారు.. మాకింతే ఇచ్చారు.. ఇదే హాట్‌టాపిక్‌గా మారింది.. 'మా ఇంట్లో నాలుగు ఓట్లు ఉన్నాయి. వివిధ పార్టీల నుంచి సుమారు రూ.20 వేల వరకూ చేతిలో పడ్డాయి. రూ.10 వేలు అప్పులకుపోను మిగతా వాటి తో పిల్లలకు బట్టలు కొన్నాను'.. 'నేను కూడా అంతే. రూ.5 వేలు ఆయన పట్టుకెళ్లాడు. మిగతా డబ్బులతో మిక్సీ, స్టాండు ఫ్యాను కొన్నాను' ఇదీ ఇద్దరు గృహిణుల మధ్య సెల్‌ఫోన్ సంభాషణ. ఇంతకీ విషయం ఏమిటంటే. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నుంచి ఓటుకు పెద్ద మొత్తంలో నోటు అందింది.. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు పండుగ కళొచ్చింది.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

నాయకుల పుణ్యమా అని మార్కెట్‌లో ప్రస్తుతం రూ.500 నోట్ల హవా సాగుతోంది. సాధారణంగా సంక్రాంతి పండుగకు వస్త్ర, గృహోపకరణాల దుకా ణాలు కొనుగోలుదారులతో నిండుగా ఉంటాయి. ప్రస్తుతం అదే పరిస్థితి ఉంది..దుకాణాలు చాలా బిజీగా ఉంటు న్నాయి. ఎన్నికలు ఖరీదైన వ్యవహా రంగా మారిపో యిన సంగతి తెలిసిందే. నోటు చేతిలో పడితేనే ఓటు పడుతుంది.ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల కు ఓటుకు రూ.2 వేల వరకూ పం పిణీ చేశారు. రెం డు ఓట్లు ఉంటే సుమారు రూ. 10 వేలు వచ్చింది.. ఆ సొమ్ము ఓటర్ల చేతుల్లోంచి దుకాణాలకు చేరుతోంది.

డబ్బులు వచ్చాయిలా..

ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కి వారం ముందు నుంచే వైసీపీ ఓటుకు రూ.2500 నుంచి రూ.4 వేల వరకూ ఇచ్చిన విషయం తెలిసిందే. ఒక ఇంట్లో నాలుగు ఓట్లు ఉంటే వివిధ పార్టీల నుంచి రూ.20 వేల వరకూ అందాయి. ఎందుకంటే అభ్యర్థులు తమకే ఓటు వేయమని పోటీ పడి డబ్బులు పంచారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు పేద, మధ్య తరగతి ప్రాంతాలే లక్ష్యంగా ఓట్లు కొనుగోలు చేశాయి. దీనికి కోట్లాది రూపాయలు కుమ్మరించాయి. మూడం చెల విధానంలో డబ్బు పంపిణీ జరిగింది. ఎన్నికల షెడ్యూల్‌కి ముందే అభ్యర్థి నుంచి ఆయా వార్డుల్లో ముఖ్య నాయకుల ఇళ్లకు డబ్బులు చేరాయి. అక్కడి నుంచి వార్డు బాధ్యులు సొమ్ములను ఓటరు లిస్టుల ప్రకారం తమ కార్యకర్తలకు పంచే పని అప్పగించారు. ఈ తతంగం సుమారు 10 రోజుల పాటు సాగింది.

జనానికి ఎన్నికల పండుగొచ్చింది..

రూ.300 కోట్లు పంచేశారు..

జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధి లోనూ డబ్బుల పంపిణీ జోరుగా సాగింది. గ్రామాల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఇచ్చారు. జిల్లా లో మొత్తం 16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పట్ట ణాల్లో కాస్త అటూ ఇటూ అయినా గ్రామాల్లో పంపకాలు పక్కాగా జరిగాయి. సుమారు 10 లక్షల మంది ఓటర్లకు సరాసరి రూ.3 వేల చొప్పున చేతిలో పడ్డాయని అను కున్నా ఆ అంకెను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి.ఆ లెక్కన జిల్లాలోని ఓటర్లకు అభ్యర్థులు అక్షరాలా రూ.300 కోట్లు పంపిణీ చేశారు. వీటిలో 90 శాతం రూ.500 నోట్లే ఉన్నాయి.అందువల్ల ఎక్కడ చూసినా ఆ నోట్లే దర్శనమి స్తున్నాయి.బార్లు, బ్రాందీషాపులు.. ముఖ్యంగా వస్త్ర దుకా ణాలు, గృహోపకరణాల షోరూంలకు చేరుతున్నాయి.

- జిల్లాలో రూ.300 కోట్లు పంపిణీ
- ఎన్నికల డబ్బులతో షాపింగ్
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- ఓట్ల సొమ్ముతో జనం జల్సా
- సందడిగా రాజమండ్రి మార్కెట్

మా ఓట్ల డబ్బేది..

ఇప్పటికీ ఓట్ల డబ్బుల కోసం జనాలు నాయకు లను నిలదీస్తున్నారు. వైసీపీ పంపిణీ ప్రక్రియలో కొన్ని చోట్ల స్థానిక నాయకులు డబ్బులు నొక్కేయడం, ఓటరు జాబితాలో అన్నిటికీ 'టిక్'లు పెట్టేసి వారి కార్యాలయా లకు అందజేయడం వంటివి చేశారు. ఇప్పుడు చేతిలో డబ్బులు పడని ఓటర్లు ఆ జాబితాలను పరిశీలించుకొనే వరకూ వెళుతున్నారు.స్థానికంగా ఉండే నాయకులను నిలదీస్తున్నారు. కొన్ని చోట్ల సగం డబ్బులు నొక్కేయగా, మరి కొందరు మొత్తానికే ఎసరు పెట్టారు. దీంతో ఎన్నికల పోలింగ్ ముందు రోజు పెద్ద రగడే జరిగింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. వైసీపీ నాయకులను జనాలు నిలదీ స్తుండడంతో కొందరు నాయకులు చాటుమాటుగా బయట తిరుగుతున్నారు. మా డబ్బులు ఏమయ్యా యంటూ సిటీ పరిధిలోని క్వారీ మార్కెట్, సింహాచల నగర్,తాడితోట,నారాయణపురం తదితర ప్రాంతాల్లో, రూ రల్‌లోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులను ఓటర్లు గట్టిగానే నిలదీస్తున్నారని సమాచారం.

దుకాణాలు కిటకిట..

జిల్లాతో పాటు అటు ఏజెన్సీ, ఇటు కోనసీమ ప్రాంతాలకు రాజమహేంద్రవరం వాణిజ్య కేంద్రం. రవాణా సదుపాయం బాగుండడం, పెద్ద సంఖ్యలోని దుకాణాలు ప్రజలను ఆకర్షిస్తాయి.ముఖ్యంగా వస్త్ర దుకాణాలకు పెట్టింది పేరు. దీంతో గ్రామాల నుంచి రాజమహేంద్ర వరం ఎక్కువగా వస్తున్నారు. వస్తువులను, వస్త్రాలను కొనుగోలు చేసుకొని ఇంటిబాట పడుతున్నారు. దీంతో ముహూ ర్తాలు లేని సమయంలో ఉసూరంటూ ఉండే దుకా ణాలు జనాలతో హుషారుగా కనిపిస్తున్నాయి. మరో వైపు ఎన్నికల సందర్భంగా చలామణిలోకి వచ్చిన డ బ్బు లెక్కల్లో చూపించారా అనే ఆందోళన నెలకొంది.



ప్రాణాలు తీసిన ఈత సరదా 7
గోదావరిలో ముగ్గురు గల్లంతు



సత్యదేవుడి కల్యాణం..
అన్నవరంలో ఘనంగా ఆరంభమైన ఉత్సవాలు 7



నన్నయలో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

మూడంచెల భద్రతను పరిశీలించిన ఎస్పీ జగదీశ్

దివాన్‌చెరువు, మే 18 : ఆదికవి నన్నయ వర్శిటీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.నన్నయ వర్శిటీలో చేసిన ఏర్పాట్లను శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత తదితర అంశాలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.ప్రశాంత వాతావరణంలో లెక్కింపు పూర్తి చేయాలన్నారు.ఈ మేరకు పోలీస్ అధికారులతో కలిసి కార్యాచరణ రూపొందించారు. మూడు షిఫ్ట్‌ల్లో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద బం దోబస్తు, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచామన్నారు. జిల్లాలో జూన్ 4వ తేదీన లెక్కింపు పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ (ఎస్‌బీ) డి.ప్రభాకర్, డీఎస్పీ (నార్త్‌జోన్) కే.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్(ఎస్‌బీ) సూరిఅప్పారావు, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడు పెండ్లికొడుకాయనే

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి కల్యాణోత్సవాలు

అన్నవరం, మే 18:

సత్యదేవుడు పెండ్లికొడుకైన వేళ ప్రకృతి పులకించింది. రత్నగిరి శోభిల్లింది. సత్యదేవుడి సాప్తాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా తొలిరోజైన శనివారం సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికొడుకు, పెండ్లికుమార్తెలుగా చేసే కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. పిలిస్తే పలికే దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి క్రోధి నామ సంవత్సర దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం సాయంత్రం 4.30కి అనివేటి మండపంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. ముందుగా వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై నవ వధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మరో వేదికపై పెండ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం ఉల్లూకల గౌరీపూజను నిర్వహించారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించిన పిమ్మట ముత్తైదువులు పసుపు దంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు దివ్యాభరణాలు ధరింపచేసి నుదుట తిలకం, బుగ్గనచుక్కతో అలంకరించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించారు.





పసుపు దంచుతున్న ముత్తైదువులు

హాస్యోక్తులతో ఎదుర్కోలు ఉత్సవం

సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మొదటిరోజైన శనివారం రాజరామరాయ కళామందిరంలో నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం ఆద్యంతం హాస్యోక్తులతో సాగింది. స్వామివారి తరుపున చైర్మన్ ఐ.వి రోహిత్ కొందరు పండితులు అమ్మవారి తరపున ఈవో రామచంద్రమోహన్ మరి కొందరు పండితులు రెండు బృందాలుగా విడిపోయి స్వామిఅమ్మవార్ల కీర్తిప్రతిష్టలు, గుణగణాలు, వంశకీర్తి చలోక్తులతో కీర్తిస్తూ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లగ్నపత్రికలు ఒకరినొకరు మార్చుకుంటూ కల్యాణ శుభఘడియలు పండితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



ఉల్లూకల గౌరీపూజను నిర్వహిస్తున్న పండితులు

వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

స్వామివారి దివ్య కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గ్రామోత్సవంలో వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములను ఊరేగించారు. ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి గ్రామస్థులకు సీతారాములు ఆహ్వానించేందుకు ప్రతీకగా దీనిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు దివ్యకల్యాణం

సత్యదేవుడి వార్షిక దివ్యకల్యాణం ఆదివారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 40 అడుగుల వెడల్పుతో వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీప అలంకరణలతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. సుమారు 25 వేల మంది విచ్చేస్తారని అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కల్యాణవేడుక తిలకించేందుకు విచ్చేస్తారని అధికారులు తెలిపారు.



వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

పెదశేషవాహనంపై భావనారాయణస్వామి



పెదశేషవాహనంపై స్వామి,అమ్మవారు

సర్పవరం జంక్షన్, మే 18 : కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు భక్తుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం, పలు రకాల విశేష ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహ మహోత్సవంలో భాగంగా స్వామివారిని మాఢ వీధుల్లో పెద శేషవాహనంపై ఊరేగించారు. ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కట్టా నూకరాజు బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేగుళ్ల, లీలాకృష్ణపై అట్రాసిటీ కేసు

కపిలేశ్వరపురం, మే 18: పోలింగ్ సందర్భంగా ఈనెల 13న వల్లూరులో జరిగిన ఘర్షణ నేపథ్యంలో కేసులు నమోదవుతున్నాయి. తమను కులం పేరుతో దూషించారని గ్రామానికి చెందిన పలివెల రోకేష్, నక్కా భాస్కర రావు, నక్కా అమ్మిరాజులు విడివిడిగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, స్థానిక టీడీపీ నాయకుడు వేగుళ్ల వీరబాబులపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



నో మేన్ జోన్‌గా 'నన్నయ'

దివాన్‌చెరువు, మే 18: జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని నో మేన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. దీంతో విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ వర్సిటీ అధికారులు నిలుపుదల చేశారు. జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచగా భద్రతా బలగాలు 24 గంటలూ కాపలా కాస్తున్నాయి. అలాగే వర్సిటీ పరిధిలో 144 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో విశ్వ విద్యాలయాన్ని నో మ్యాన్ జోన్‌గా ప్రకటించారు. దీంతో శనివారం ఉదయం విధులకు హాజరైన బోధన, బోధనేతర సిబ్బంది గుర్తింపు కార్డులను వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విశ్వవిద్యాలయ అధికారుల పర్యవేక్షణలో పోలీస్‌లు పరిశీలించి వారి వివరాలను ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేసుకున్న అనంతరం విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వరకూ అనుమతించారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలు 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని, సిబ్బందిని ఇంటి నుంచే పనిచేయాలని సూచించారు. అత్యవసర సమయంలో 15 మంది అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు అనుమతించాలని జిల్లా అధికారులను కోరుతూ యూనివర్సిటీ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది.

జూన్ 6 వరకూ కార్యకలాపాలు నిలుపుదల: వీసీ

ఎన్నికల కారణంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నన్నయ యూనివర్సిటీలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని వీసీ కె.పద్మరాజు శనివారం తెలిపారు. ఈవీఎంలు, ఇతర ఎన్నికల పత్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కోసం కౌంటర్లు ఉన్న కారణంగా క్యాంపస్‌ను నో మ్యాన్ జోన్‌గా ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ప్రకటించారన్నారు.

కిటకిటలాడిన 'వాడపల్లి'



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్రేయపురం, మే 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, చిర్ల జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42.14 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ఈఏపీ సెట్‌కు 1060 మంది హాజరు

మొత్తం 95.24 శాతం నమోదు

జేఎన్టీయూకే, మే 18: కాకినాడ జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి శనివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1113 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1060 మంది హాజరయ్యారని, 53 మంది గైర్హాజరు కాగా 95.24 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 950 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 918 మంది హాజరయ్యారని, 32 మంది పరీక్ష రాయలేదని మొత్తం 96.63 శాతం హాజరు నమోదైందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 341 మంది హాజరయ్యారని నలుగురు గైర్హాజరు కాగా మొత్తం 98.84 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ఉదయం సెషన్ మాత్రమే జరిగాయని ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

గోదావరిలో ముగ్గురు గల్లంతు

ఇద్దరి మృతదేహాలు లభ్యం

మరొకరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు



సంఘటన స్థలం వద్ద గుమిగూడిన స్థానికులు, బంధువులు



జయకుమార్ మృతదేహం



ఈశ్వరరెడ్డి మృతదేహం



సబ్బెళ్ల ఈశ్వరరెడ్డి



జయకుమార్



గోదావరిలో గల్లంతైన సంపతరెడ్డి

రావులపాలెం, మే 18: వాళ్లు ఐదుగురు స్నేహితులు.. సెలవులు కావడంతో సరదాగా బయటకు వెళదామనుకుని గోదావరి ఒడ్డుకు వచ్చారు. సరదాగా ఈత కొడదామనుకుని వారిలో నలుగురు గోదావరిలో దిగారు. అయితే దురదృష్టవశాత్తూ ముగ్గురు మునిగిపోయి గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా, మరొకరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ విషాదకర సంఘటన శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం చినవంతెన వద్ద ఉంటున్న సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి(20), అతని సోదరుడు సత్యనారాయణరెడ్డి, పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి(16), అక్కడే నివాసం ఉంటున్న పెంటా జయకుమార్(19), కొమ్మర్తి రాజేష్ ఈ ఐదుగురు స్నేహితులు. కాగా సంపతరెడ్డి విజయనగరం నుంచి వేసవి సెలవులకు రావులపాలెం పిన్ని ఇంటికి వచ్చాడు. ఐదుగురు స్నేహితులు కలిసి మధ్యాహ్న సమయంలో గోదావరి స్నానం చేద్దామని గౌతమి గోదావరి పాతబ్రిడ్జి వద్దకు వెళ్లి అక్కడ నుండి ఇసుక మేటలో కిలోమీటరు మేర నడిచి నీటి ప్రవాహం వద్దకు చేరుకున్నారు. వీరిలో పెద్దవాడైన సత్యనారాయణరెడ్డికి ఈత రాకపోవడంతో గట్టున కూర్చుని ఉన్నాడు. మిగిలిన నలుగురు గోదావరిలో స్నానానికి దిగారు. కొంతసేపటికే అందరూ మునిగిపోయారు. వారిలో కొమ్మర్తి రాజేష్ కంగారుగా బయటకు వస్తుండటంతో అక్కడే ఉన్న సత్యనారాయణరెడ్డి ముగ్గురు గల్లంతయినట్లు గుర్తించి కేకలు వేశాడు. ఆ సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి గల్లంతైన వారి కోసం వెతికిన ప్రయోజనం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎం.ఆంజనేయులు, రెవెన్యూ, కొత్తపేట ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సబెళ్ళ ఈశ్వరరెడ్డి, పెంటా జయకుమార్, మృతదేహాలు లభ్యం కాగా గల్లంతైన సంపతరెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆంజనేయులు, తహసీల్దారు అశోక్‌వర్మ తెలిపారు.

గుండెలవిసేలా రోదిస్తున్న సోదరుడు

ఐదుగురులోని ముగ్గురు అన్నదమ్ములు కాగా మరో ఇద్దరు స్నేహితులు. సబ్బెళ్ళ సత్యనారాయణరెడ్డి మృతిచెందిన సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డిలు సొంత అన్నదమ్ములు కాగా వాళ్ళ పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి వేసవి సెలవులు అని పెద్దమ్మ ఇంటికి రావులపాలెం వచ్చాడు. గోదావరి స్నానానికి వెళ్లిన సమయంలో తమ్ముళ్లు ఇద్దరు నదిలో గల్లంతు కావడంతో సత్యనారాయణరెడ్డి గుండెలవిసేలా రోదించాడు. ఈశ్వరరెడ్డి మృతదేహం లభ్యం కాగా సంపతరెడ్డి మృతదేహం కోసం గాలిస్తున్నారు. సత్యనారాయణరెడ్డి తండ్రి సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కంద అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం తీవ్రవిషాదంలో మునిగిపోయింది. వేసవి సెలవులకు వచ్చిన సంపతరెడ్డి గల్లంతవ్వడంతో విజయనగరంలో నివాసం ఉంటున్న తండ్రి దుర్గారెడ్డికి బంధువులు సమాచారం అందించారు. అక్కాచెల్లెళ్ల బిడ్డలు ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఒకరు గల్లంతు కావడంతో ఆ కుటుంబాలు రోదిస్తున్న తీరు స్థానికులను సైతం కంటతడిపెట్టించింది.

చేతికి వచ్చిన కొడుకు మృతిపై తండ్రి ఆవేదన..

రావులపాలెం చినవంతెన వద్ద నివాసం ఉంటున్న జయకుమార్ తండ్రి వడ్రంగి పనిచేస్తూ కొడుకును చదివిస్తున్నాడు. జయకుమార్ స్థానిక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ ఖాళీ సమయంలో ఫొటో స్టూడియోలో పనిచేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవ్వరివల్ల కాలేదు. కాగా సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంపతరెడ్డి 10వ తరగతి చదువుతున్నాడు.

గోదావరిలో వరుస ఘటనలతో ఆందోళన...

గోదావరిలో వరుస ఘటనలు జరగడంతో నదీ పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆలమూరు మండలం మడికికి చెందిన ముగ్గురు మహిళలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వెళ్తూ బడుగువారిలంక వాని వద్ద ముగ్గురు మృతిచెందిన సంఘటన మరువక ముందే ఐదు కిలోమీటర్ల దూరంలో వారం తిరగకుండా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి వద్ద గోదావరిలో ఇద్దరు గోదావరిలో ఈతకు వెళ్లి మృతిచెందడం, మరొకరు గల్లంతు కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలువలకు నీటిసరఫరా నిలుపుదల చేయడం వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నీటి ప్రవాహం అధికంగా ఉండటమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు భావిస్తున్నారు. గోదావరి చెంతకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిట్ విచారణ పారదర్శకంగా జరగాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 18 : రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చెలరేగిన హింస నేపథ్యంలో ఏర్పాటైన సిట్ విచారణ అత్యంత పారదర్శకంగా జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. భారత దేశ ఎన్నికల చరిత్రలో రాష్ట్రంలో ఇలాంటి హింస ఎన్నడూ జరగలేదన్నారు. అత్యున్నత పోలీస్ అధికారులు పలువురు సస్పెండ్ కావడం, కలెక్టర్లు, ఇతర ఐపీఎస్ అధికారులు బదిలీ కావడం ఎన్నడూ లేదన్నారు. అధికార పార్టీకి కొందరు ఐపీఎస్‌లు తొత్తులుగా మారడం వల్లే ఇదంతా జరిగిందని, పోలీస్ అధికార వ్యవస్థ దీన్ని చూసి సిగ్గుపడాలన్నారు. గోదావరి నడిబొడ్డున అక్రమంగా ఎంత ఇసుక తవ్వుతున్నారో అందరికీ తెలుసని, ఇసుక అక్రమాలు, అక్రమ సంపాదనపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పార్టీ ఓటమి ఖాయమని, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ఓడిపోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు దేశంలో లౌకిక వ్యవస్థను గట్టిగా విశ్వసించారని, ఇప్పుడున్న నాయకులు కూడా లౌకిక రాజ్యాంగంపై పోరాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాయకులకు తప్పనిసరిగా విజన్ ఉండాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

రాజానగరం, మే 18 : ఉపాధ్యాయ వృత్తిలో నాయకులుగా రాణించాలంటే విజన్ ప్రధానంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. నాయకులు సర్వనైపుణ్యాల సమ్మేళనమైతే బాగా రాణిస్తారన్నారు. నాయకుడిగా ఎదిగిన ఉపాధ్యాయుల్లో దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసినవారు ఎందరో ఉన్నారన్నారు. నాయకుడు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అటువంటి ఉపాధ్యాయులే ఉత్తమ లీడర్లుగా ఎదుగుతారని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యారంగ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పలు సంస్కరణలు తీసుకొచ్చేందుకు యోచిస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్ నిబంధనలపై ఎం.రఘునాథరెడ్డి, ఏపీఎస్టీఎఫ్ పాత్ర ఉద్యమాల నిర్వహణ అంశంపై ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రాతినిధ్యాలు, రాయబారాలు, ఆర్థిక వ్యవహారాలపై ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు రాజుల నాగేశ్వరరావు ప్రసంగించారు. శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిసినందున ఎస్టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీవిశ్వనాథ్, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, మహిళా నాయకులు శైలజా భవాని, సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌జే త్రినాథ్‌బాబు, బి.ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, శామ్యూల్‌సన్, వైవీవీ సత్యనారాయణ, సత్తిరాజు పాల్గొన్నారు.

తెలంగాణ ఈఏపీ సెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



ఎస్.రాధాకృష్ణ



సాకేత్‌రాఘవ్

రాజమహేంద్రవరం రూరల్, మే 18: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీ సెట్ పరీక్షల్లో రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ విద్యార్థి ఎస్.రాధాకృష్ణ స్టేట్ 2వ ర్యాంక్, ఎస్.సాకేత్ రాఘవ్ స్టేట్ 4వ ర్యాంక్, పి.శివసంపత్ నాయుడు స్టేట్ 25వ ర్యాంక్, వీఎస్‌జీఎస్‌వీ రామకృష్ణారెడ్డి స్టేట్ 53వ ర్యాంక్, వి.అభిశ్యామ్ స్టేట్ 64వ ర్యాంక్, డి.ప్రభాస్ స్టేట్ 91వ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

శనేశ్వర ఆలయం కిటకిట



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట, మే 18: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,43,585 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో

డొంకరాయి పవర్ కెనాల్ పనులకు

అనుమతులు కోరాం



డొంకరాయి పవర్ కెనాల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తదితరులు

మోతుగూడెం, మే18: డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతుల పనులకు అనుమతులు కోరామని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ డొంకరాయి నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించేందుకు నిర్మించిన 16 కిలోమీటర్ల కెనాల్‌కు నిర్వహణా పనులను ప్రతీ ఏటా మే నెలలో చేపడుతుంటామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కెనాల్ మరమ్మతుల పనులు కొంత మేరకు చేపట్టామని, ఇంకా ఎక్కడైనా మరమ్మత్తులకు గురయితే వాటిని గురించి అక్కడ కెనాల్ పటిష్ఠత కోసం గ్రౌటింగ్, కాంక్రీట్ పనులను నిర్వహిస్తామన్నారు. కెనాల్ నిర్వహణా పనులు చేపడితే సీలేరు కాంప్లెక్సులోని 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రం, 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఎగువ సీలేరు(సీలేరు)లో విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం ఉండదన్నారు. కెనాల్ నిర్వహణ పనులకు గ్రిడ్ అధికారులు, జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఎల్‌సీ అనుమతులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. సీలేరు పర్యటనకు వచ్చిన హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ కూడా ఈ నేపథ్యంలో కెనాల్‌ను పరిశీలించారన్నారు. సీలేరు కాంప్లెక్సు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయంలో ఆంధ్రావాటా 7 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో 7 టీఎంసీలతో కలిపి 14 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, ఈ నీటినే వర్షాకాలం సీజన్ ప్రారంభం అయ్యేంత వరకు పొదుపుగా వినియోగించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని సీఈ శ్రీధర్ తెలిపారు.

47 టేకు దుంగలు స్వాధీనం



దేవీపట్నం, మే 18: మండలంలో ఇందుకూరు రేంజ్ పరిధిలో సీతారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో అక్రమంగా రవాణాకు సిద్ధంగా ఉంచిన టేకు కలపను శనివారం అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. 47 దుంగలను స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.లక్ష ఉంటుందని రేంజ్ అధికారి దుర్గాకుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధవళేశ్వరం టింబర్ డిపోకు తరలిస్తామన్నారు.

నాడు ఆకులు రాల్చి..నేడు చిగురించి



దేవీపట్నం, మే18: పెదభీంపల్లి గ్రామ పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం ఆకట్టుకుంటోంది. గత నెల రోజుల క్రితం ఎండకు ఆకులు రాల్చిన వృక్షం ఈ వారం వర్షాలు కురవడంతో చిగురించి అబ్బురపరుస్తోంది. వాతావరణం మార్పుతో చెట్టు చిగురించి నీడనిచ్చి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది.

21 నుంచి సమ్మక్క జాతర ఉత్సవం



సమ్మక్క ఆలయం

ఎటపాక, మే 18: గన్నేరుకొయ్యపాడు గ్రామంలో ఈ నెల 21 నుంచి 23 వరకు సమ్మక్క జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 21న మంగళవారం అమ్మవార్లకు గంగా స్నానం, అదే రోజు రాత్రికి మండెము వెలిగించుట, 22న బుధవారం పుట్టిమట్టి వన దేవతలకు గద్దె వద్దకు చేర్చుట, 23న సమ్మక్క పగిడి గద్దెరాజు మహోత్సవం నిర్వహించనున్నారు.

నేడు సత్యనారాయణస్వామి కల్యాణం

ఎటపాక, మే 18: ఎటపాక మండలం తోటపల్లి, చోడవరం గ్రామాల్లోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో ఆదివారం సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించాలని కోరారు.

అబ్బురపరిచిన మబ్బులు



ఎటపాక, మే 18: ఆకాశంలో మబ్బులు అబ్బురపరిచాయి. నేలను తాకుతున్నట్లుగా సుందర దృశ్యం శనివారం ఎటపాక మండలం, లక్ష్మీపురం గ్రామంలో ఆవిష్కృతమైంది. ఉదయం సమయంలో ఆకాశం నీలిరంగుగా మారి ఒక్కసారిగా కారు మబ్బులు నేలను తాకుతున్నట్లు కనిపించడంతో అటువైపుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకించారు.

ఆదమరిస్తే అంతే!

- సీసీ రోడ్డు నిర్మించి బెర్మ్‌లు వదిలేశారు
- డ్రైనేజీలకు కనెక్టింగ్ ఇవ్వక నిలిచిపోతున్న నీరు
- ఎన్నికల ముందు కార్పొరేషన్ హడావుడి పనులు



దానవాయిపేటలో సీసీ రోడ్డు పనుల్లో బెర్మ్‌లు వేయకుండా వదిలేసిన దృశ్యాలు

రాజమహేంద్రవరం సిటీ, మే 18: రాజమహేంద్రవరంలో ఎన్నికల కోడ్ సమీపిస్తుండగా హడావుడిగా సీసీ రోడ్ల పనులు చేపట్టిన నగర పాలక సంస్థ అటుపై ఆయా పనులను కొనసాగించింది. రాజమహేంద్రవరంలో దానవాయిపేట, ప్రకాష్‌నగర్, జాంపేట, దేవిచౌక్-పశువుల ఆసుపత్రి రోడ్డు, రామచంద్రరావుపేట, తుమ్మలోవ, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో అధికారులు హడావుడిగా పనులు చేశారు. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులకు సంబంధించి నాణ్యతపై అనేక విమర్శలు వ్యక్తమౌతున్నాయి. వాటికి తోడు లోపాలు కనిపిస్తున్నాయి. సీసీ రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో డ్రైనేజీలకు రోడ్డుకు మధ్య ఖాళీల్లో బెర్మ్‌లు నిర్మించాల్సివుంది. కాని వాటిని నిర్మించకపోవడంతో రోడ్డు పక్కన బైకులు పార్కింగ్ కష్టతరమౌతోంది. అలాగే వర్షం పడినప్పుడు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. చాలా చోట్ల రోడ్లపై వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్లేలా కనెక్టింగ్ ఇవ్వకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది.

వాసవీమాత జయంతి

- అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు



ధవళేశ్వరంలో కన్నె పిల్లలతో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రంగంపేట, మే 18: రంగంపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్యవైశ్యులంతా ఉదయం కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో నాయకులు మండవిల్లి రాజా, గళ్లా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్నెపిల్లలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై ఆశీనులను చేసి వాయిద్యాలు, సన్నాయిమేళం, కోలాట బృందంతో ఆర్యవైశ్యులు గ్రామోత్సవం నిర్వహించారు.

గోకవరం: గోకవరంలో శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరికి అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని ఆలయాన్ని అలంకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కడియం: కడియంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి నాగబాబు, నేతి నానాజీ, చెక్కా కాశి, బొడ్డు లక్ష్మీనారాయణ, వెత్స లక్ష్మీనారాయణ తదితరుల ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు వాసవీమాత జయంతిని నిర్వహించారు. అమ్మవారిని మంగళవాయిద్యాలతో కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. వేదపండితులు గణపతిపూజ, వాసవీమాతకు అభిషేకాలు, కుంకుమపూజ జరిపారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రామకృష్ణతులసి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీతానగరం: సీతానగరంలోని వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు కలశాలతో వెంట నడిచారు. అనంతరం వాసవీ మాతకు అభిషేకాలు జరిపి అనంతరం భోజన కార్యక్రమాలు నిర్వహించారు.



సీతానగరంలో వాసవీమాత వెంట ఊరేగింపుగా కలశాలతో మహిళలు

ఆర్‌సీఆర్‌బీపై రెయిలింగ్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మే 18(ఆంధ్ర జ్యోతి): చారిత్రాత్మకమైన రాజమహేంద్ర వరం రోడ్ కం రైలు వంతెనపై ప్రమాదకర పరిస్థితులు ఉండడంపై శుక్రవారం 'ఆదమరిస్తే గోదాట్లోకే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా ఆగిపోయిన మరమ్మతు పనులను పునరుద్ధరించారు. సిమెంటు రెయిలింగ్ తొలగించిన చోట పెట్టిన సిమెంటు దిమ్మెలను తొలగించారు. హుటాహుటిన ఇనుప రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఫుట్‌పాత్‌ని నిర్మించాల్సి ఉంది. వంతెన మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంపై జనాలు మండిపడుతున్నారు.



వంతెనపై ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రక్తపోటును నియంత్రించుకోవాలి

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

రాజమహేంద్రవరం సిటీ, మే18: ఒత్తిడితో రక్తపోటు పెరుగుతుందని అవగాహనతో దీన్ని నియంత్రించుకోవాలని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. న్యూరో సర్జరీ డాక్టర్ సాంబశివారెడ్డి ఆసుపత్రిలో శనివారం ప్రపంచ రక్తపోటు దినంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రక్తపోటు సైలెంట్ కిల్లర్ అని అభివర్ణించారు. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా తక్కువ అవగాహన ఉందన్నారు. అధిక రక్తపోటు వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల సమస్యలు, అకాల మరణాలు సంభవిస్తాయన్నారు. సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.హేమకుమారి, హాస్పిటల్ హెడ్ సునీత, నర్సులు, కృష్ణవేణి, మాధవి, శాంతి, రాణి, సత్య పాల్గొన్నారు.

22న మహిళల ఓపెన్ చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 18: చెస్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్, మహిళా చెస్ పోటీలు రాజమండ్రి మెయిన్ రోడ్ రత్న పేలస్ పక్క వీధిలోని ది రాజమండ్రి ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఈ నెల 22న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన మొదటి నలుగురు విజేతలు, విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర ఓపెన్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అలాగే మహిళల విభాగంలో మొదటి నలుగురు విజేతలు ఈ నెల 25, 26 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి మహిళా పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు www.apchess.org ద్వారా తమ పేర్లను 21వ తేదీ లోపుగా నమోదు చేయించుకోవాలని జీవీ కుమార్ తెలిపారు.

ఆంజనేయులు మాస్టర్‌కు డాక్టరేట్



కొవ్వూరు, మే 18: కొవ్వూరు మండలం మద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కట్టుంగ ఆంజనేయులు డాక్టరేట్ అందుకున్నారు. శనివారం బెంగళూరులో భారత్ విర్చ్యువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పేద విద్యార్థులకు సహకరించడం, గణితం, సైన్సు ప్రతిభా పోటీలకు విద్యార్థులను తీర్చిదిద్దడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవా కార్యక్రమాలతో మానవత, లయన్స్, రోటరీ సంస్థల నుంచి ఆయన పలు అవార్డులను గతంలో అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆంజనేయులుకు పాఠశాల సహోపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

గోపాలపురంలో మహిళ ఆత్మహత్య

గోపాలపురం, మే 18: గోపాలపురంలో మతిస్థిమితం లేక ఓ మహిళ శనివారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడింది. స్టేషన్ అధికారి దుర్గారావు వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన అంకనాల వెంకట రమణ(36) భర్త మరణానంతరం గోపాలపురంలోని బంధువుల వద్ద కొన్నేళ్లుగా నివసిస్తోంది. చెడువ్యసనాలకు బానిసై మతిస్థిమితం లేక కుటుంబ సభ్యులు మందలించారని భావోద్వేగంతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైటర్ తెలిపారు.

డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలి

సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ

నల్లజర్ల, మే 18: రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ అన్నారు. శనివారం నల్లజర్ల తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ప్రజా పంపిణీ 92శాతం మాత్రమే నమోదైందని, జూన్ నెలలో 96శాతం పెంచే విధంగా ప్రతి ఎండీయూ కృషి చేయాలన్నారు. జూన్ 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి ప్రజా పంపిణీ ప్రారంభించాలన్నారు. బియ్యం, పంచదార మాత్రమే అందుబాటులో ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు. డీలర్లు, ఎండీయూలు పరస్పరం అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరుకులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీలర్స్ సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, చంద్రం, దూళిపాల వెంకన్న, బాసింశెట్టి లక్ష్మణరావు, ఎండీయూలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



దేవరపల్లిలో శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దేవరపల్లి, మే 18: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. స్వామివారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేశారు. శనివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా శ్రీవారి డోలోత్సవం, శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీటీడీ సరస్వతి, ప్రసాద్ బృందం చేపట్టిన అన్నమాచార్య సంకీర్తన, స్వరాభిషేకం అందర్ని అలరించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాలకు పూజలు

ఉండ్రాజవరం, మే 18: మండలంలోని వెలగదుర్రు గ్రామంలోని ఎస్సీ ఏరియాలోని రామాలయంలో సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠ సందర్భంగా శనివారం ఊరేగింపు నిర్వహించారు. వాయిద్యాల సందడితో, బాణసంచా కాల్పులతో స్వామివార్ల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసారు. ఈనెల 19న విగ్రహాల ప్రతిష్ఠ హోమాలు, ప్రత్యేకపూజలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

వేణు శర్మకు దాసరి ప్రతిభ రత్న అవార్డు

నిడదవోలు, మే 18: నిడదవోలుకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు, జ్యోతిష్య శాస్త్ర పరిశోధకుడు మద్దిరాల సత్యవేణు శర్మకు హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్ ఆవరణలో మా అసోసియేషన్, తెలుగు ఫిలిమ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సౌజన్యంతో దాసరి ప్రతిభరత్న అవార్డును అందజేశారు. దీంతో శనివారం నిడదవోలులోని వేణుశర్మ నివాసంలో పలువురు ప్రముఖులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 18: గ్రూప్-2 మెయిన్స్‌కు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 25వ తేదీ నుంచి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పిల్లి సత్య రమేష్ తెలిపారు. గ్రూప్ -2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ప్రారంభించనున్నట్టు చెప్పారు. గ్రూప్-2 మెయిన్స్‌కు పోటీ పడుతున్న అభ్యర్థులు రాజమహేంద్రవరంలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వేసవి శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

రాజానగరం, మే 18: సీబీఎస్ఇ సిలబస్ పేరుతో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, తక్షణమే వాయిదే వేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు)రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎల్.సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. గైట్ కళాశాలలో శనివారం వారు మాట్లాడుతూ వేకేషన్ డిపార్ట్‌మెంట్ అయిన విద్యాశాఖలోని ఉపాధ్యాయులను వేకేషన్ నుంచి దూరం చేసే శిక్షణా తరగతులను వాయిదా వేయాలన్నారు. వేకేషన్ కాలంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు క్రమంగా కేటాయించడం లేదని, విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలకు అనుగుణంగా వంట ఏజెన్సీలకు కుకింగ్ చార్జీలు పెంచాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయవాణి సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు 26 జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు

జిల్లా 9వ అదనపు జడ్జి మాధురి



ఖైదీలకు సదుపాయాలపై ఆరా తీస్తున్న జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, మే 18(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, ఖైదీల తరఫున వాదించడానికి అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా న్యాయవాదిని నియమిస్తామని జిల్లా 9వ అదనపు జడ్జి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కేంద్ర కారాగారాన్ని శనివారం సందర్శించి ఖైదీలతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. పరివర్తన చెంది సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని వాళ్లకు సూచించారు. జైలులో జీవన పరిస్థితులు, పరిశుభ్రత, పారిశుధ్యం, బ్యారక్స్‌లోని వాష్‌రూమ్స్, మురుగు నీటి నిర్వహణ, తాగునీరు, భద్రత, ఆహార నాణ్యత, స్టాక్ రిజిస్టరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. విడుదలైన తర్వాత జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఖైదీలకు వృత్తి నైపుణ్యాల పట్ల మెరుగైన శిక్షణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు వివరించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని పారా లీగల్ వలంటర్లీతో న్యాయమూర్తులు పేర్కొన్నారు.

గౌతమి గ్రంథాలయంలో ఉచిత శిక్షణ శిబిరం

రాజమహేంద్రవరం, కల్చరల్ మే 18: స్థానిక గౌతమీ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా శిబిరం జూన్ 7 వరకు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ ఆటలు ఆడించడం, ఒక మంచి పుస్తకంపై సమీక్ష, వివిధ పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, వేదగణితం వంటి అంశాలను పిల్లలకు నేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.

నల్లమిల్లికి బెల్లంతో తులాభారం



బిక్కవోలు, మే 18: మెళ్లూరు గ్రామంలోని శ్రీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి బెల్లం తో తులాభారం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గంగుమళ్ల శ్రీనివాస్, దేవి దంపతులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రామకృష్ణారెడ్డికి సీటు రావాలని మొక్కుకున్నామని, ఆ మొక్కును తీర్చుకున్నామన్నారు. ముందుగా రామకృష్ణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు పెదిరెడ్డి వీరన్న, అచ్యుతరామయ్య, గంగరాజు, కృష్ణార్జున, వీరన్న, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

సంతోషిదేవికి పీహెచ్‌డీ ప్రదానం



దివాన్‌చెరువు, మే18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్‌లో స్కాలర్ అరిగెల సంతోషిదేవికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్‌డీని శనివారం ప్రదానం చేశారు. సీఎస్ఈలోని అసోసియేట్ ప్రొఫెసర్ వి.పెర్సిస్ మార్గదర్శకత్వంలో కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిల్లో విద్యార్థుల బదిలీ ధ్రువీకరణల కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీస్ సొల్యూషన్ పనితీరు అనే అంశంపై సంతోషిదేవి పరిశోధన చేశారు. ఈ సాంకేతిక పరిశోధన ద్వారా భద్రతతో పారదర్శకంగా సర్టిఫికెట్లు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం,మే 18: ఈ నెల 20వ తేదీన రఘుదేవపురం ఫీడర్‌లోని రఘుదేవపురం, సీతానగరం లంక భూము మోటార్లకు సోమవారం ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. రఘుదేవపురం ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

గోదాట్లో అంతా.. దొంగలే!

ఇది కాదా డ్రెడ్జింగ్ : కొవ్వూరు వైపు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్


దోపిడీకి బాటలు : పెరవలి మండలం తీపర్రు ఇసుక దోపిడీకి గోదావరిలో వేసిన బాటలు

కళ్లుండీ..చూడలేరు : రాజమహేంద్రవరం గాయత్రి ర్యాంపులో శనివారం యథేచ్ఛగా సాగుతున్న ఇసుక తవ్వకాలు

నాయకుల చల్లనిచూపు.. అధికారుల అండ ఉంటే ఇంకేముంది.. అక్రమార్కులు రెచ్చిపోతారు.. సుప్రీంకోర్టు చెబితే వింటారా.. ఎన్‌జీటీ చెబితే వింటారా.. ఎవరు చెప్పినా అంతే..! అధికార దండమే మెడలో వేసుకుని తిరిగేవాళ్లకు అడ్డేమి ఉంటుంది.. ప్రస్తుతం జిల్లాలో ఇదే జరుగుతోంది.. ఒక పక్కన సుప్రీంకోర్టు.. యంత్రాలతో ఇసుక తీత ఆపి.. అక్రమాలు నిలిపివేసి.. ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని ఆదేశించినా ఎక్కడా ఇసుక తవ్వకాలు ఆగలేదు.. యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి.. అంతే కాకుండా జిల్లాలో కమిటీలు వేయాలని కూడా ఆదేశించింది. మన జిల్లాలో ఇసుక కమిటీ ఉంది.. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు.. అవేమీ అక్రమాలను ఆపలేకపోయాయి.. యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం లోనూ ఇదే పరిస్థితి. అధికార వైసీపీ ఒత్తిళ్లకు లొంగి అధికారులు ఇప్పటికీ ఇసుక అక్రమాలను కళ్లప్పగించి చూస్తున్నారు. పైగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇచ్చిన నివేదికలు పక్కదారి పట్టించాయనే విమర్శలు ఉన్నాయి. మరి ఈసారి నివేదిక ఎలా ఇస్తారోనని అందరూ ఎదురుచూస్తున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు కొదువే లేదు. అఖండ గోదావరిలో సాగుతున్న డ్రెడ్జింగ్‌ను గోదావరి జిల్లా ప్రజలతో పాటు రోడ్ కం రైలు, ఫోర్త్ బ్రిడ్జి, రైల్వే ఆర్చ్ వంతెన మీద రైళ్లలోనూ, ఇతర వాహనాల్లో ప్రతి రోజూ ప్రయాణించే వేలాది మంది చూస్తూనే ఉన్నారు. అయితే మన అధికార యంత్రాంగానికి ఇవేమీ కనిపించడంలేదు. అధికార వైసీపీలోని పెద్దల ఒత్తిడికి భయపడి, కుమ్మక్కయ్యారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.ఈ ఐదేళ్లలోనూ వైసీపీ పెద్దలు చెప్పినట్టు విని తప్పులు జరుగుతున్నా కళ్లు మూసుకున్న అధికారులు ప్రస్తుతం భయపడిపోతున్నారు. కొత్త ప్రభుత్వం వస్తే ఆ కుంభకోణాలపై విచారణ ఉంటుందని చర్చించుకుంటూ వణికిపోతున్నారు. ఎన్నికలు ముగిసినా ఇంకా వైసీపీ నేతల ఒత్తిడి తగ్గలేదు. ఇసుక అక్రమాలు ఆగలేదు.

ఆర్‌కే... ఇతనో దోపిడీదారు?

కొవ్వూరులో ప్రేమ్‌రాజ్ ఆత్మహత్య తర్వాత మొత్తం అఖండగోదావరి పడవ ర్యాంపులన్నీ ఆర్‌కే అనే వ్యక్తి చేతిలోకి వెళ్లాయి. అతను పైసా కూడా పెట్టుబడి లేకుండా.. స్థానికంగా ఇసుక తీసే వ్యక్తులకు, వైసీపీ నేతలకు ర్యాంపులు అప్ప గించి రూ.కోట్లు గడించాడు. ఏపీఎండీసీ హయాంలో ఇసుక వ్యాపారం జరి గినపుడు రూ.5 కోట్ల డిపాజిట్ సొమ్ము నొక్కేసి ఇటీవల జైలుకు కూడా వెళ్లడం గమనార్హం. అతని ఆధ్వర్యంలో వైసీపీ పెద్దలు ఇక్కడ వందల కోట్ల ఇసుక కుంభకోణానికి పాల్పడ్డారు. ఇప్పటికీ ఇసుకను తోడేస్తూనే ఉన్నారు. అనుమతి లేకుండా ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ రాత్రి పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిపోతున్న సంగతి తెలిసిందే.

బ్రిడ్జిల ప్రక్కనా తవ్వేస్తున్నారు..

వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజికి మూడు కిలోమీటర్ల వరకూ ఎటు వంటి తవ్వకాలు జరగకూడదు. రోడ్డు కమ్ రైలు బ్రిడ్జి ఎగువ వైపు 500 మీటర్లు దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయకూడదు.ఇది నిబంధన. గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే.ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.

ఐదేళ్లుగా మహా ఇసుక కుంభకోణం

గామన్ బ్రిడ్జి అవతల డ్రెడ్జింగ్

ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే సమీపంలోనే తవ్వేస్తున్నారు.అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇటీవల గామన్ బ్రిడ్జి కొంతమేర కుంగి పోయిన సంగతి తెలిసిందే. అయినా ఇసుక అక్రమాలు ఆగడంలేదు. ఇన్ని అక్రమాలు జరుగు తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు..ఇవాళ సుప్రీంకోర్టుకు ఏమని రిపోర్టు చేస్తారో చూడవలసిందే.

- సుప్రీంకోర్టు ఆదేశించినా ఆగని తవ్వకాలు
- ఇసుకాసురులకు అధికారుల అండదండలు
- గతంలో ఇచ్చిన నివేదికలన్నీ తప్పుడివే
- వణికిపోతున్న అధికార యంత్రాంగం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- నేటికీ యథేచ్ఛగా సాగుతున్న డ్రెడ్జింగ్
- ఇప్పుడేం నివేదికిస్తారో చూడాల్సిందే

మరో పక్క గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన సంస్థ పేరుతో డిసెంబర్ నుంచి మరింత డ్రెడ్జింగ్ జరుగుతోంది. ఇదో పెద్ద కుంభకోణమంటూ విమర్శలు వస్తు న్నాయి. గత మే నెల నుంచి అనుమతుల్లేకుండా జిల్లా శాండ్ కమిటీ నుంచి ఆమోదం పొందినట్టు చెబుతూ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచిన సం గతి తెలిసిందే. కొద్ది రోజు లుగా ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగారు.దోపిడీ ఇలా ఉంటే అధికారి కంగా డ్రెడ్జింగ్ అంటూ మరొకరు రంగంలోకి దిగారు. సుమారు రెండేళ్ల కిందట బ్యారేజికి ఎగువ నుంచి గామన్ బ్రిడ్జి వరకూ అఖండ గోదా వరిలో నీటి నిల్వ పెంచడానికి వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. అప్పట్లో ముగ్గురు కాంట్రా క్టర్లు టెండర్లు వేయగా వారికి నచ్చిన కాంట్రాక్టర్‌కే ఒకే చేయిం చారు.ఆ కాంట్రాక్టర్ చాలా కాలం వదిలేశారు. ఇటీవల రంగంలోకి దిగారు. ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం 1.70 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. రాజమ హేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ. 144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్ల కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి ఎవరూ కనిపించరు. కనీస నిబంధనలు పాటించడంలేదు. ఇదే సమ యంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట ఉండే వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ కొనసాగు తూనే ఉంది.గాయత్రి, కోటి లింగాలకాతేరు, వెంకటనగర్, కొవ్వూరు ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ జరుగుతోంది.


కొవ్వూరులో శనివారం లోడింగ్ ఇలా..


కనిపించదా సారూ : రోడ్ కం రైలు బ్రిడ్జి చెంతనే సాగుతున్న ఇసుక డ్రెడ్జింగ్

రూ. వేల కోట్లు దోచేశారు..

గోదాట్లో రూ.వేల కోట్ల ఇసుక కుంభకోణం జరిగింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అమల్లో ఉండేది. రవాణా, లోడింగ్ చార్జీలు పెట్టుకుంటే ఇసుక దొరికేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రకరకాల ప్రయోగాలు చేశారు.ఏపీఎండీసీ చేత కొద్దిరోజులు చేయించి రూ.వందల కోట్లు దోచుకు న్నారు. తర్వాత జేపీ సంస్థకు రెండేళ్లు కాంట్రాక్టుకు ఇచ్చి ఎటువంటి అను మతులు, బిల్లులు కూడా లేకుండా ఇసుక తవ్వేసిన సంగతి తెలిసిందే.దీనిపై లెక్కలు అడిగినా ఏ అధికారీ చెప్పలేకపోతున్నాడు. తమ వద్ద లేవని చెప్పడం గమనార్హం. గత మే నెలలో జేపీ సంస్థ కాంట్రాక్టు పూర్తయిపోవడంతో నేరుగా వైసీపీ పెద్దలే ప్రతి నెలా రూ.కోట్లు కప్పం కట్టేవిధంగా అనధికారికంగా ఇసుక వ్యాపారాన్ని తమ అనుచరులకు అప్పగించిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో కొవ్వూరు వైపు ఒక అనధికార కాంట్రాక్టర్ ప్రేమ్‌రాజ్ రైలుపట్టాల కింద తలపెట్టి బలన్మరణం చెందిన సంగతి తెలిసిందే.

అనధికారికంగా డ్రెడ్జింగ్

కొవ్వూరు, మే 18 : గోదావరిని అధికార పార్టీ నేతలు అనధికారిక డ్రెడ్జిం గ్‌తో ఇసుకను దోచుకుంటున్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో గోదావరి వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి గత ఐదేళ్లుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. గోదావరి నదిలో బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు పడవల ద్వారా నదిలోకి వెళ్లి ఇసుక తవ్వకాలు చేపట్టాలి. కానీ దానికి విరుద్ధంగా భారీ యంత్రాలతో అనధికారికంగా డ్రెజ్జింగ్ చేసి గోదావరి నదిని కొల్లగొట్టి ఇసుక దోచుకుంటున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్నిస్తున్నా అధికార పార్టీ నేతలు, అధికారుల్లో కనీసం కదలిక లేదు. అక్రమ తవ్వకాలను అడ్డుకుని ప్రశ్నిం చిన ప్రతిపక్ష పార్టీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి స్టేష న్‌లో నిర్బంధించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కొవ్వూరు, రాజమహేంద్రవరంలను కలు పుతూ గోదావరిపై నిర్మించిన నాలుగు లైన్ల వంతెన (గామన్ బ్రిడ్జి) కొవ్వూరు వైపు కుంగిపోయింది. మర మ్మతు పనులను పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకు పాత్రికేయులు గామన్ వంతెన సమీపంలో డ్రెడ్జింగ్ చేస్తున్న యంత్రాన్ని చూపించిన ఎటువంటి ఫలితం లేదు. ఆ సమయంలో కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గోదావరిలో డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతి లేదని, కేవలం బోట్స్‌మెన్ సొసైటీ లు మాత్రమే తవ్వకాలు చేపట్టాలని తెలి పారు. అనధికార డ్రెడ్జింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఈబీ, పోలీస్ అధికారులకు ఆదేశాలిస్తామని తెలి పారు. సుమారు రెండు నెలలైనప్పటికి డ్రెడ్జింగ్ యథేచ్ఛగా జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, ఎస్ఈబీ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దులు చెరిపేసి.. అడ్డగోలుగా తవ్వేశారు..

కడియం, మే 18 : ఇసుకాసురులు రెచ్చిపోయారు.. వేమగిరి-బుర్రిలంక ర్యాంపులో ఇష్టానుసారం ఇసుక తవ్వేశారు. భారీ యంత్రాలతో సుమారు 30 అడు గుల లోతు వరకు ఇసుకను తవ్వి నదీగర్భానికి తూట్లు పొడిచారు. ఇప్పటికీ ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉంది. కడియం మండలం వేమగిరి-బుర్రిలంక లంకలతో పాటు ఆవల ఒడ్డున ఉన్న ఆత్రేయపురం మండలం వద్దిపర్రు వరకు హద్దులు చెరిపేసి మరీ ఇసుకను దోచేస్తున్నారు. ఇటీవల ఉన్నత న్యాయస్థానం తవ్వకాలు చేయవద్దని ఆదేశాలివ్వడంతో ముందే నిల్వ ఉంచిన అక్రమ స్టాకు తరలించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. గతంలో జియోట్యాగింగ్ చేసి ఏడాదికి ఇంత మేరకు తవ్వకాలు చేయాలని ఆంక్షలు ఉండేవి. ప్రస్తుతం అవేం లేవు.. ఉన్నది ఒకటే తవ్వుకో.. దోచుకో అంతే. దీంతో ఇసుకను యంత్రాల సాయంతో రాత్రి పగలూ తేడా లేకుండా తవ్వేస్తున్నారు. ఇటీవల అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో ఇస్టానుసారం తవ్వేసి తరలించేశారు. కాటన్ బ్యారేజీకి కేవలం కొద్ది మీటర్ల దూరంలో ఉన్న వేమగిరి-బుర్రిలంక ఇసుక ర్యాంపులో కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా తవ్వకాలకు పాల్పడ్డారు. అనధికారిక స్టాక్‌పాయింట్లు పెట్టి గుట్టలుగా ఇసుకను నిల్వ పెట్టారు.


పట్టుకోండి చూద్దాం : బుర్రిలంకలో ఏటిగట్టు చెంతనే ఉన్న ఇసుక గుట్టలు


కనిపెట్టండి చూద్దాం : తీపర్రులో నీటికి అడ్డుకట్ట వేసి సాగిన ఇసుక తవ్వకాలు

గోదావరిలో నీరు ఆపితే.. బాగోతం బయటకు..

పెరవలి, మే18: తీపర్రు గోదావరి ఇసుక ర్యాంప్‌లో అక్రమ తవ్వకాలపై అధికా రులేం తేలుస్తారోనని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 2025 వరకు ప్రతిమ కంపెనీకి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు అధికారులు వస్తే ర్యాంప్‌లో తవ్వకాలు ఆపి ఖాళీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వచ్చిన రోజు ఆ తవ్విన ప్రదేశం అంతా కలియ తిరిగారు.. అదే సమయంలో అక్రమంగా తవ్విన ఇసుక ఎంతో లెక్క కట్టాల్సి ఉన్నప్ప టికి ఆ విధంగా చేయలేదు. అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే బ్యారేజీ వద్ద దిగువకు వదిలే నీటిని 4 రోజులు ఆపి వేస్తే ఇక్కడ నీటి నిల్వలు తగ్గి అక్రమాల బాగోతం బయటపడుతోంది. గోదావరిలో ఇసుక ఎంత తరలిపోయింది.. అక్కడి ఇసుక గుట్టలు చూస్తే అర్థమవుతుందని ఆ గుట్టలను కూడా పట్టించుకోకుండా వదిలివేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అటు కోర్టులను , ఇటు ప్రజలను మోసగించే ప్రయత్నాలు మానుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్‌కు.. ఓటు..నోటు!


కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు

ప్రస్తుతం జనానికి ఎన్నికల పండుగొచ్చింది.. ఎన్నికల పండుగేమిటంటారా.. డబ్బులు ఎప్పుడు చేతిలో ఉంటే అప్పుడే పండుగ కదా.. ప్రస్తుతం ఏ ఇద్దరు మహిళలు ఫోన్‌లో మాట్లాడుకున్నా ఇదే గొడవ.. ఓటుకు మీకెంత ఇచ్చారు.. మాకింతే ఇచ్చారు.. ఇదే హాట్‌టాఫిక్‌గా మారింది.. 'మా ఇంట్లో నాలుగు ఓట్లు ఉన్నాయి. వివిధ పార్టీల నుంచి సుమారు రూ.20 వేల వరకూ చేతిలో పడ్డాయి. రూ.10 వేలు అప్పులకుపోను మిగతా వాటి తో పిల్లలకు బట్టలు కొన్నాను'.. 'నేను కూడా అంతే. రూ.5 వేలు ఆయన పట్టుకెళ్లాడు. మిగతా డబ్బులతో మిక్సీ, స్టాండు ఫ్యాను కొన్నాను' ఇదీ ఇద్దరు గృహిణుల మధ్య సెల్‌ఫోన్ సంభాషణ. ఇంతకీ విషయం ఏమిటంటే. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నుంచి ఓటుకు పెద్ద మొత్తంలో నోటు అందింది.. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు పండుగ కళొచ్చింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

నాయకుల పుణ్యమా అని మార్కెట్‌లో ప్రస్తుతం రూ.500 నోట్ల హవా సాగుతోంది. సాధారణంగా సం క్రాంతి పండుగకు వస్త్ర, గృహోపకరణాల దుకా ణాలు కొనుగోలుదారులతో నిండుగా ఉంటాయి. ప్రస్తుతం అదే పరిస్థితి ఉంది.దుకాణాలు చాలా బిజీగా ఉంటు న్నాయి. ఎన్నికలు ఖరీదైన వ్యవహా రంగా మారిపో యిన సంగతి తెలిసిందే. నోటు చేతిలో పడితేనే ఓటు పడుతుంది.ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల కు ఓటుకు రూ.2 వేల వరకూ పం పిణీ చేశారు. రెం డు ఓట్లు ఉంటే సుమారు రూ. 10 వేలు వచ్చింది.. ఆ సొమ్ము ఓటర్ల చేతుల్లోంచి దుకాణాలకు చేరుతోంది.



డబ్బులు వచ్చాయిలా..

ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కి వారం ముందు నుంచే వైసీపీ ఓటుకు రూ.2500 నుంచి రూ.4 వేల వరకూ ఇచ్చిన విషయం తెలిసిందే. ఒక ఇంట్లో నాలుగు ఓట్లు ఉంటే వివిధ పార్టీల నుంచి రూ.20 వేల వరకూ అందాయి. ఎందుకంటే అభ్యర్థులు తమకే ఓటు వేయమని పోటీ పడి డబ్బులు పంచారు. ముఖ్యంగా వైసీపీ నాయ కులు పేద, మధ్య తరగతి ప్రాంతాలే లక్ష్యంగా ఓట్లు కొనుగోలు చేశాయి. దీనికి కోట్లాది రూపాయలు కుమ్మరించాయి. మూడం చెల విధానంలో డబ్బు పం పిణీ జరిగింది. ఎన్నికల షెడ్యూల్‌కి ముందే అభ్యర్థి నుంచి ఆయా వార్డుల్లో ముఖ్య నాయకుల ఇళ్లకు డబ్బులు చేరాయి. అక్కడి నుంచి వార్డు బాధ్యులు సొమ్ములను ఓటరు లిస్టుల ప్రకారం తమ కార్యకర్తలకు పంచే పని అప్పగించారు. ఈ తతంగం సుమారు 10 రోజుల పాటు సాగింది.

జనానికి ఎన్నికల పండుగొచ్చింది..

రూ.300 కోట్లు పంచేశారు..

జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధి లోనూ డబ్బుల పంపిణీ జోరుగా సాగింది. గ్రామాల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఇచ్చారు. జిల్లా లో మొత్తం 16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పట్ట ణాల్లో కాస్త అటూ ఇటూ అయినా గ్రామాల్లో పంపకాలు పక్కాగా జరిగాయి. సుమారు 10 లక్షల మంది ఓటర్లకు సరాసరి రూ.3 వేల చొప్పున చేతిలో పడ్డాయని అను కున్నా ఆ అంకెను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి.ఆ లెక్కన జిల్లాలోని ఓటర్లకు అభ్యర్థులు అక్షరాలా రూ.300 కోట్లు పంపిణీ చేశారు. వీటిలో 90 శాతం రూ.500 నోట్లే ఉన్నాయి.అందువల్ల ఎక్కడ చూసినా ఆ నోట్లే దర్శనమి స్తున్నాయి.బార్లు, బ్రాందీషాపులు.. ముఖ్యంగా వస్త్ర దుకా ణాలు, గృహో పకరణాల షోరూంలకు చేరుతున్నాయి.

- జిల్లాలో రూ.300 కోట్లు పంపిణీ
- ఎన్నికల డబ్బులతో షాపింగ్
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- ఓట్ల సొమ్ముతో జనం జల్సా
- సందడిగా రాజమండ్రి మార్కెట్

మా ఓట్ల డబ్బేది..

ఇప్పటికీ ఓట్ల డబ్బుల కోసం జనాలు నాయకు లను నిలదీస్తున్నారు. వైసీపీ పంపిణీ ప్రక్రియలో కొన్ని చోట్ల స్థానిక నాయకులు డబ్బులు నొక్కేయడం, ఓటరు జాబితాలో అన్నిటికీ 'టిక్'లు పెట్టేసి వారి కార్యాలయా లకు అందజేయడం వంటివి చేశారు. ఇప్పుడు చేతిలో డబ్బులు పడని ఓటర్లు ఆ జాబితాలను పరిశీలించుకొనే వరకూ వెళుతున్నారు.స్థానికంగా ఉండే నాయకులను నిలదీస్తున్నారు. కొన్ని చోట్ల సగం డబ్బులు నొక్కేయగా, మరి కొందరు మొత్తానికే ఎసరు పెట్టారు. దీంతో ఎన్ని కల పోలింగ్ ముందు రోజు పెద్ద రగడే జరిగింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. వైసీపీ నాయకులను జనాలు నిలదీ స్తుండడంతో కొందరు నాయకులు చాటుమాటుగా బయట తిరుగుతున్నారు. మా డబ్బులు ఏమయ్యా యంటూ సిటీ పరిధిలోని క్వారీ మార్కెట్, సింహాచల నగర్,తాడితోట,నారాయణపురం తదితర ప్రాంతాల్లో, రూ రల్‌లోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులను ఓటర్లు గట్టిగానే నిలదీస్తున్నారని సమాచారం.

దుకాణాలు కిటకిట..

జిల్లాతో పాటు అటు ఏజెన్సీ, ఇటు కోనసీమ ప్రాం తాలకు రాజమహేంద్రవరం వాణిజ్య కేంద్రం. రవాణా సదుపాయం బాగుండడం, పెద్ద సంఖ్యలోని దుకాణాలు ప్రజలను ఆకర్షిస్తాయి.ముఖ్యంగా వస్త్ర దుకాణాలకు పెట్టింది పేరు. దీంతో గ్రామాల నుంచి రాజమహేంద్ర వరం ఎక్కువగా వస్తున్నారు. వస్తువులను, వస్త్రాలను కొనుగోలు చేసుకొని ఇంటిబాట పడుతున్నారు. దీంతో ముహూ ర్తాలు లేని సమయంలో ఉసూరంటూ ఉండే దుకా ణాలు జనాలతో హుషారుగా కనిపిస్తున్నాయి. మరో వైపు ఎన్నికల సందర్భంగా చలామణిలోకి వచ్చిన డ బ్బు లెక్కల్లో చూపించారా అనే ఆందోళన నెలకొంది.

ఎన్నికల వేళ.. విద్యార్థుల గోల
ధ్రువీకరణ పత్రాలు అందక గగ్గోలు

నాయకుడికి విజన్ ఉండాలి
ముగిసిన ఎస్‌టీయూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

జగన్ ఓటమి ఖాయం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ 8


నన్నయలో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

మూడంచెల భద్రతను పరిశీలించిన ఎస్పీ జగదీశ్

దివాన్‌చెరువు, మే 18 : ఆదికవి నన్నయ వర్శిటీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.నన్నయ వర్శిటీలో చేసిన ఏర్పాట్లను శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రత తదితర అంశా లకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.ప్రశాంత వాతావరణంలో లెక్కింపు పూర్తి చేయాలన్నారు.ఈ మేరకు పోలీస్ అధికారులతో కలిసి కార్యా చరణ రూపొందించారు. మూడు షిఫ్ట్‌ల్లో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద బం దోబస్తు, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమె రాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచామన్నారు. జిల్లాలో జూన్ 4వ తేదీన లెక్కింపు పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలి పారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ (ఎస్‌బీ) డి.ప్రభాకర్, డీఎస్పీ (నార్త్‌జోన్) కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్(ఎస్‌బీ) సూరిఅప్పారావు, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలి

సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ



డీలర్లతో సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నల్లజర్ల, మే 18: రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ అన్నారు. శనివారం నల్లజర్ల తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ప్రజా పంపిణీ 92శాతం మాత్రమే నమోదైందని, జూన్ నెలలో 96శాతం పెంచే విధంగా ప్రతి ఎండీయూ కృషి చేయాలన్నారు. జూన్ 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి ప్రజా పంపిణీ ప్రారంభించాలన్నారు. బియ్యం, పంచదార మాత్రమే అందుబాటులో ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు. డీలర్లు, ఎండీయూలు పరస్పరం అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరుకులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీలర్స్ సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, చంద్రం, దూళిపాల వెంకన్న, బాసింశెట్టి లక్ష్మణరావు, ఎండీయూలు వసంతాడ ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

జీవీ ప్రసాద్‌కు అచ్చిబాబు పరామర్శ



తాళ్లపూడి, మే 18: పితృవియోగం పొందిన అన్నదేవరపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జీవీ ప్రసాద్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) శనివారం పరామర్శించారు.జీవీ తండ్రి వెంకటేశ్వరరావు(84) ఇటీవల మృతి చెందారు.దీంతో అచ్చిబాబు.. జీవీ కుటుంబాన్ని కలిసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, గంటా శివరామకృష్ణ, కలిశెట్టి సన్యాసినాయుడు, గన్నిన సత్తిబాబు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి పాల్గొన్నారు.

వేణు శర్మకు దాసరి ప్రతిభ రత్న అవార్డు



నిడదవోలు, మే 18: నిడదవోలుకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు, జ్యోతిష్య శాస్త్ర పరిశోధకుడు మద్దిరాల సత్యవేణు శర్మకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ ఆవరణలో మా అసోసియేషన్, తెలుగు ఫిలిమ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సౌజన్యంతో దాసరి ప్రతిభరత్న అవార్డును అందజేశారు. దీంతో శనివారం నిడదవోలులోని వేణుశర్మ నివాసంలో పలువురు ప్రముఖులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



నిడదవోలు, మే 18: నిడదవో లులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింత లతోపాటు చికిత్స పొందు తున్న వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు.నంద కిషోర్, భాగ్యలక్ష్మిల ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామా రావు, కాళ్ళ రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్ పాల్గొన్నారు.



దేవరపల్లిలో శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

దేవరపల్లి, మే 18: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. స్వామివారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేశారు. శనివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా శ్రీవారి డోలోత్సవం, శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీటీడీ సరస్వతి, ప్రసాద్ బృందం చేపట్టిన అన్నమాచార్య సంకీర్తన, స్వరాభిషేకం అందర్ని అలరించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయులు మాస్టర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఆంజనేయులు

కొవ్వూరు, మే 18: కొవ్వూరు మండలం మద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కట్టుంగ ఆంజనేయులు డాక్టరేట్ అందుకున్నారు. శనివారం బెంగళూరులో భారత్ వర్చ్యువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పేద విద్యార్థులకు సహకరించడం, గణితం, సైన్సు ప్రతిభా పోటీలకు విద్యార్థులను తీర్చిదిద్దడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవా కార్యక్రమాలతో మానవత, లయన్స్, రోటరీ సంస్థల నుంచి ఆయన పలు అవార్డులను గతంలో అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆంజనేయులుకు పాఠశాల సహోపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి, మే 18: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో శనివారం గోపాలపురం మండలం దొండపూడిలో 10లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ స్వామి తెలిపారు. అతని కేసు నమోదు చేశామన్నారు. ఆరుగురు పాత ముద్దాయిలను పట్టుకుని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురంలో మహిళ ఆత్మహత్య

గోపాలపురం, మే 18: గోపాలపురంలో మతిస్థిమితం లేక ఓ మహిళ శనివారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడింది. స్టేషన్ అధికారి దుర్గారావు వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన అంకనాల వెంకటరమణ(36) భర్త మరణానంతరం గోపాలపురంలోని బంధువుల వద్ద కొన్నేళ్లుగా నివసిస్తోంది. చెడువ్యసనాలకు బానిసై మతిస్థిమితం లేక కుటుంబ సభ్యులు మందలించారని భావోద్వేగంతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైటర్ తెలిపారు.

సీతారాముల విగ్రహాలకు పూజలు

ఉండ్రాజవరం, మే 18: మండలంలోని వెలగదుర్రు గ్రామంలోని ఎస్సీ ఏరియాలోని రామాలయంలో సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠ సందర్భంగా శనివారం ఊరేగింపు నిర్వహించారు. వాయిద్యాల సందడితో, బాణసంచా కాల్పులతో స్వామివార్ల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసారు. ఈనెల 19న విగ్రహాల ప్రతిష్ఠ హోమాలు, ప్రత్యేకపూజలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు

పెరవలి, మే 18: మండలంలోని అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రాధాకృష్ణ తెలిపారు. 19న స్వామి, అమ్మవార్లను వధూవరులుగా చేయడం, ఎదుర్కోలు ఉత్సవం, కల్యాణోత్సవం, గ్రామోత్సవం, 20న లక్ష్మీ హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు, 21న సామూహిక కుంకుమార్చన, 22న శిష్యబృందార్చన, 23న చక్రస్నానం, పుష్పయాగం, జరుగుతాయని తెలిపారు.

సర్టిఫికెట్స్ ఎప్పుడిస్తారో!

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలకు పాట్లు
- నూతన విద్యాసంవత్సరం ఆరంభంలో అగచాట్లు
- ఎన్నికల విధులతో ఆగిన సర్టిఫికెట్ల జారీ
- లెక్కింపునకు 16 రోజులున్నా పట్టించుకోని అధికారులు



రాజమహేంద్రవరం సిటీ, మే 18: ఉన్నత విద్యకు అర్హత సాధించిన విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో చాలా జాప్యం జరుగుతుంది. ఎన్నికల కోడ్ అమలు ప్రారంభం నుంచి రెవెన్యూ శాఖ నుంచి జారీ కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు రాక విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో దాదాపు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణపత్రాలు జారీ జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు వేచిచూస్తున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయినా వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతన విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో ధ్రువీకరణపత్రాల అవసరం పెరిగింది.. నూటికి 90 శాతం విద్యార్థులు ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చదువుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 80 శాతం పైబడి అడ్మిషన్లు అయిపోయాయి. ఆయా కాలేజీల్లో చేరేందుకు కుల, ఆదాయ ,నివాస ధ్రువీకరణ పత్రాల అవసరం ఉంటుంది.దీంతో ఇప్పటికే విద్యార్థులు మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధికారులు అందరు ఎన్నికల విధుల్లో ఉండడం వల్లన ఆయా దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఐదు రోజులు కావడంతో దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయాలకు వెళుతుంటే ఇంకా పూర్తి కాలేదనే సమాధానం వస్తుంది.జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు 16 రోజుల గడువు ఉన్నప్పటికి సర్టిఫికెట్స్ జారీలో జాప్యం తప్పడం లేదు.ఒక పక్క రోజులు గడుస్తున్నాయి.. కాలేజీల అడ్మిషన్లు వేగంగా అయిపోతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి ,కలెక్టర్ డాక్టర్ మాధవీలత వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీచేయించాల్సిన అవసరం ఉంది.

డీకంపోజర్‌తో సేంద్రియ పదార్థం తయారీ

మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్



డీ కంపోజర్‌తో సేంద్రీయ పదార్థాన్ని తయారుచేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, మే 18: వరి గడ్డి డీకంపోజర్ ద్వారా పంట పొలంలోనే గడ్డిని కుళ్ల బెట్టి సేంద్రీయ పదార్థాన్ని తయారు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించినట్టు మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దొమ్మేరులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మట్టి నమూనా సేకరణ, క్షేత్ర సందర్శన, వేస్టు డీకంపోజర్ తయారుచేసి తద్వారా పంట కోసిన తరువాత పొలంలో మిగిలివున్న గడ్డిని కాల్చి వేయకుండా కుళ్లబెట్టి సేంద్రియ పదార్థం తయారుచేయడంపై రైతులకు, రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ డీకంపోజర్ ద్వారా పేడ, వ్యవసాయ, కూరగాయల వ్యర్థాలు, ఎండుకర్రలు, బెరడులను వేగంగా కుళ్లబెట్టవచ్చునన్నారు. దాని నుంచి వచ్చే కంపోస్టు మట్టి ఎరువుగా ఉపయోగించుకోవచ్చునన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉద్యానవనాలు ఉన్నవారు డీకంపోజర్‌ను సరళమైన గార్డెన్ ఇన్‌పుట్‌గా ఉపయోగించవచ్చునన్నారు. ఇది నత్రజని, భాస్వరం, పొటాష్‌లను నేల పోషకాలుగా పొందడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో కేఎం దక్షిణామూర్తి, సీహెచ్ సునీత, ప్రొఫెసర్స్ ఎస్‌వీ భవానిప్రసాద్, టి.ఉషారాణి, డి.శేఖర్ పాల్గొన్నారు.

విజన్ ఉన్న వాడే నాయకుడు

మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

- ఘనంగా ముగిసిన ఎస్టీయు శిక్షణ తరగతులు



ఎస్టీయూ ముగింపు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

రాజానగరం, మే 18: ఉపాధ్యాయ వృత్తిలో నాయకులుగా రాణించాలంటే విజన్ ప్రధాన లక్షణమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. గైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ(ఎస్టీయు)రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. నాయకులు సర్వనైపుణ్యాల సమ్మేళనమైతే బాగా రాణిస్తారన్నారు. నాయకుడిగా ఎదిగిన ఉపాధ్యాయుల్లో దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసినవారు ఎందరో ఉన్నారన్నారు. నాయకుడు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అటువంటి ఉపాధ్యాయులే ఉత్తమ లీడర్లుగా ఎదుగుతారని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. విద్యారంగ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో పలు సంస్కరణలు తీసుకొచ్చేందుకు యోచిస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్ నిబంధనలపై ఎం.రఘునాథరెడ్డి, ఏపీఎస్‌టీఎఫ్ పాత్ర ఉద్యమాల నిర్వహణ అంశంపై ఏపీఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రాతినిధ్యాలు, రాయబారాలు, ఆర్థిక వ్యవహారాలపై ఉపాధ్యావాణి ప్రధాన సంపాదకుడు రాజుల నాగేశ్వరరావు ప్రసంగించారు. శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిసినందున ఎస్టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీవిశ్వనాథ్, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, మహిళా నాయకులు శైలజా భవాని, సంఘ రాష్ట్ర నాయకుడు ఎస్‌జే త్రినాథ్‌బాబు, బి.ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, సామ్యూల్‌సన్, వైవీవీ సత్యనారాయణ, సత్తిరాజు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

- సిట్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరగాలి
- ఇంత హింస గతంలో ఎన్నడూ జరగలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 18 : రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చెలరేగిన హింస నేపథ్యంలో ఏర్పాటైన సిట్ విచారణ అత్యంత పారదర్శకంగా జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. భారత దేశ ఎన్నికల చరిత్రలో రాష్ట్రంలో ఇలాంటి హింస ఎన్నడూ జరగలేదన్నారు. అత్యున్నత పోలీస్ అధికారులు పలువురు సస్పెండ్ కావడం, కలెక్టర్లు, ఇతర ఐపీఎస్ అధికారులు బదిలీ కావడం ఎన్నడూ లేదన్నారు. అధికార పార్టీకి కొందరు ఐపీఎస్‌లు తొత్తులుగా మారడం వల్లే ఇదంతా జరిగిందని, పోలీస్ అధికార వ్యవస్థ దీన్ని చూసి సిగ్గుపడాలన్నారు. గోదావరి నడిబొడ్డున అక్రమంగా ఎంత ఇసుక తవ్వుతున్నారో అందరికీ తెలుసు అని, ఇసుక అక్రమాలు, అక్రమ సంపాదనపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పార్టీ ఓటమి ఖాయమని, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ఓడిపోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు దేశంలో లౌకిక వ్యవస్థను గట్టిగా విశ్వసించారని, ఇప్పుడున్న నాయకులు కూడా లౌకిక రాజ్యాంగంపై పోరాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి

- అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు



తాళ్లపూడిలో వాసవీమాత పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్యులు

తాళ్లపూడి, మే 18: తాళ్లపూడిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆర్యవైశ్య ప్రముఖుడు సింహాద్రి జనార్దనరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయార్చకుడు గంగాధర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. అనంతరం భారీగా అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన సొలస సతీష్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విలువైన ఉత్సవ పల్లకీని బహూకరించారు. కార్యక్రమంలో గోకవరపు మాణిక్యం, శ్రీకాంత్, వినయ్, సాయి, మణికంఠ, జగదీష్, అనిల్ పాల్గొన్నారు.



కొవ్వూరులో వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కొవ్వూరు: కొవ్వూరు బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు ఆధ్వర్యంలో వాసవీమాతకు సహస్రనామ కుంకుమార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కక్కిరాల సూరిబాబు, పద్మావతి దంపతులు గులాబీలతో అర్చనలు, నవ పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. పువ్వులు, మామిడపండ్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో మట్టే ప్రసాద్, నాళం వీవీ శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, దేవత ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, కొత్తమాసు వాసు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కేరళ డప్పుల వాయిద్యాలు, బుట్టబొమ్మలు, వివిధ వేషధారణలతో వాసవిమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘనాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రక్తపోటును నియంత్రించుకోవాలి

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

రాజమహేంద్రవరం సిటీ, మే18: ఒత్తిడితో రక్తపోటు పెరుగుతుందని అవగాహనతో దీన్ని నియంత్రించుకోవాలని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. న్యూరో సర్జరీ డాక్టర్ సాంబశివారెడ్డి ఆసుపత్రిలో శనివారం ప్రపంచ రక్తపోటు దినంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రక్తపోటు సైలెంట్ కిల్లర్ అని అభివర్ణించారు. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా తక్కువ అవగాహన ఉందన్నారు. అధిక రక్తపోటు వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల సమస్యలు, అకాల మరణాలు సంభవిస్తాయన్నారు. సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.హేమకుమారి, హాస్పిటల్ హెడ్ సునీత, నర్సులు, కృష్ణవేణి, మాధవి, శాంతి, రాణి, సత్య పాల్గొన్నారు.

ఆర్‌సీఆర్‌బీపై రెయిలింగ్ ఏర్పాటు



రాజమహేంద్రవరం, మే 18(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన రాజమహేంద్రవరం రోడ్ కం రైలు వంతెనపై ప్రమాదకర పరిస్థితులు ఉండడంపై శుక్రవారం 'ఆదమరిస్తే గోదాట్లోకే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా ఆగిపోయిన మరమ్మతు పనులను పునరుద్ధరించారు. సిమెంటు రెయిలింగ్ తొలగించిన చోట పెట్టిన సిమెంటు దిమ్మెలను తొలగించారు. హుటాహుటిన ఇనుప రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఫుట్‌పాత్‌ని నిర్మించాల్సి ఉంది. వంతెన మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంపై జనాలు మండిపడుతున్నారు.

వేసవి శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

రాజానగరం, మే 18: సీబీఎస్ఇ సిలబస్ పేరుతో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, తక్షణమే వాయిదే వేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు)రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎల్.సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. గైట్ కళాశాలలో శనివారం వారు మాట్లాడుతూ వేకేషన్ డిపార్ట్‌మెంట్ అయిన విద్యాశాఖలోని ఉపాధ్యాయులను వేకేషన్ నుంచి దూరం చేసే శిక్షణా తరగతులను వాయిదా వేయాలన్నారు. వేకేషన్ కాలంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు క్రమంగా కేటాయించడం లేదని, విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలకు అనుగుణంగా వంట ఏజెన్సీలకు కుకింగ్ చార్జీలు పెంచాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎస్‌టీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయవాణి సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు 26 జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు

జిల్లా 9వ అదనపు జడ్జి మాధురి



సదుపాయాలపై ఆరా తీస్తున్న జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, మే 18(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, ఖైదీల తరపున వాదించడానికి అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా న్యాయవాదిని నియమిస్తామని జిల్లా 9వ అదనపు జడ్జి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కేంద్ర కారాగారాన్ని శనివారం సందర్శించి ఖైదీలతో మాట్లాడి సదు పాయాలపై ఆరా తీశారు. పరివర్తన చెంది సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని వాళ్లకు సూచించారు. జైలులో జీవన పరిస్థితులు, పరిశుభ్రత, పారిశుద్యం, బ్యారక్స్‌లోని వాష్‌రూమ్స్, మురుగు నీటి నిర్వహణ, తాగునీరు, భద్రత, ఆహార నాణ్యత, స్టాక్ రిజిస్టరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. విడుదలైన తర్వాత జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఖైదీలకు వృత్తి నైపుణ్యాల పట్ల మెరుగైన శిక్షణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు వివరించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని పారా లీగల్ వలంటర్లీతో న్యాయమూర్తులు పేర్కొన్నారు.

గౌతమి గ్రంథాలయంలో ఉచిత శిక్షణ శిబిరం

రాజమహేంద్రవరం, కల్చరల్ మే 18: స్థానిక గౌతమీ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా శిబిరం జూన్ 7 వరకు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ ఆటలు ఆడించడం, ఒక మంచి పుస్తకంపై సమీక్ష, వివిధ పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, వేదగణితం వంటి అంశాలను పిల్లలకు నేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.

నల్లమిల్లికి బెల్లంతో తులాభారం



బిక్కవోలు, మే 18: మెళ్లూరు గ్రామంలోని శ్రీవిశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన పర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి బెల్లం తో తులాభారం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గంగుమళ్ల శ్రీనివాస్, దేవి దంపతులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రామకృష్ణారెడ్డికి సీటు రావాలని మొక్కుకున్నామని, ఆ మొక్కును తీర్చుకున్నామన్నారు. ముందుగా రామకృష్ణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు పెదిరెడ్డి వీరన్న, అచ్యుతరామయ్య, గంగరాజు, కృష్ణార్జున, వీరన్న, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

సంతోషిదేవికి పీహెచ్‌డీ ప్రదానం



దివాన్‌చెరువు, మే18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్‌లో స్కాలర్ అరిగెల సంతోషిదేవికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్‌డీని శనివారం ప్రదానం చేశారు. సీఎస్ఈలోని అసోసి యేట్ ప్రొఫెసర్ వి.పెర్సిస్ మార్గదర్శకత్వంలో కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిల్లో విద్యార్థుల బదిలీ ధ్రువీకరణల కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీస్ సొల్యూషన్ పనితీరు అనే అంశంపై సంతోషిదేవి పరిశోధన చేశారు. ఈ సాంకేతిక పరిశోధన ద్వారా భద్రతతో పారదర్శకంగా సర్టిఫికెట్లు అందుతా యని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం,మే 18: ఈ నెల 20వ తేదీన రఘుదేవపురం ఫీడర్‌లోని రఘుదేవపురం, సీతానగరం లంక భూము మోటార్లకు సోమవారం ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. రఘుదేవపురం ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	గాడ్జిల్లా వర్సెస్ కాంగ్
రాధాకృష్ణ	ఆ ఒక్కటి అడక్కు
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి